వాళ్లని కలిపి విడదీసి విధి ఆడించిన వింత నాటకం?

# స్టార్ట్ ఇమ్మీడియట్లీ

అబ్బూరి శ్రీరామమూర్తి కథ

అది శ్రీకాకుళం జిల్లాలో ఒక పట్నంగా పిలవడానికి సంతరించుకుంటున్న ఒకఊరు.

అక్కడినుండి రైళ్లు నడుస్తాయికాని ఆ ఊర్లో ఎక్కేది చాలా కొద్దిమంది మాత్రమే బస్సులు నడుస్తాయి కాని చాలా తక్కువ. కాని ఎద్దుబండ్లలో ఇంకా చిన్నఊర్లకి వెళ్లేవాళ్లు, వచ్చేవాళ్లూ చాలా ఎక్కువే.

ఆ గ్రామంలో స్టేషను పక్కన ఒకే ఒక్క శివాలయం. ఆ ఆలయం ప్రక్కనే ఒక మధ్య తరగతి బ్రాహ్మణ కుటుంబం. ఒకప్పుడు బాగా వున్నవారైనా ప్రస్తుతానికి చెప్పుకోవడానికి ఇంటిపేరుతప్ప ఏమీ లేదు.


ఆ ఇంట్లో నివసించే వాళ్లలో మధ్యవయస్కులైన భార్యాభర్తలు, అక్కడ, తమ్ముడు, ఒక ఆవు, ఒక దూడ. నాలుగెకరాల స్థలంలో తాతలు కట్టించిన ఇల్లు చాలా చిన్నదని చెప్పుకోవచ్చు.

పల్లెటూరి వాతావరణాన్ని ప్రతిబింబించే అన్ని రకాల మొక్కలు ఆ ఇంటికి ప్రత్యేక ఆకర్షణ.

"రామం... ఒరేయ్ రామం!"

ఎన్నిసార్లు పిలిచినా జవాబు రానందువల్ల వంటింట్లో వంట చేస్తున్న అమ్మ కొంచెం దగ్గరగా వచ్చి "ఒరేయ్! శ్రీరామచంద్ర మూర్తీ.. ఈ లోకంలో వున్నావా... లేదా?!'' అని అడిగింది.

ఆరోజు నాకు శెలవు కావడంవల్ల టీ త్రాగుతూ ఆంధ్రభూమి సెంటర్ సెన్సేషన్ చదువుతున్న నేను ఈ లోకంలోకి వచ్చి "అబ్బా... ఏంటమ్మా! ఆదివారం పూట కూడ తెల్లవారక ముందే ఏదో పని



చెప్తూ వుంటావు..." విసుక్కున్నాను మధ్యలో డిస్టర్బ్ చేసినందుకు.

"తెల్లవారడమేంటే! అప్పుడే పదిగంటలవుతుంటే. ఉదయంనుండి చెప్తున్నాను ఈ రోజు అక్కకి ఇంటర్వ్యూ వుంది. సాయంగా వెళ్లమని.

అప్పుడు గుర్తొచ్చింది అక్కకి అదేదో కాన్వెంట్ స్కూల్లో పదకొండు గంటలకు

ఇంటర్వ్యూ వుందని. లేచి గబగబా స్నానం చేసి డ్రెస్ వేసుకుని వెళ్లాలని లేకపోయినా అక్కతోపాటు తప్పనిసరిగా బయలుదేరాను.

అది పెద్ద పట్టణం కాకపోవడంవలన టీచర్ల పోస్ట్‌కి నలుగురైదుగురికన్నా ఎక్కువ లేరు.

సమ్మర్ హాలిడేస్ కావడంవలన స్కూల ంతా డల్‌గా వుంది. ఏదో ఒక పెద్ద ఇల్లు అద్దెకు తీసుకుని చిన్న స్కూలు ప్రారంభిం చినట్లున్నారు.

మా ఊర్లో అదే మొదటి కాన్వెంట్ స్కూలు కావడంవల్ల ఎక్కువగా పిల్లలుగాని, టీచర్స్‌గాని లేరు.

అక్కడ ఇంటర్వ్యూ ఏదో అయిందనిపి ంచి, బయటికి వచ్చి సిగరెట్ తాగుతున్న నాతో "పద, వెళ్దాం" అంది అక్క.

"ఏమైంది?" అన్న ప్రశ్నకు బదులుగా "రేపు చెప్తారట" అంది.

మాట్నీ షోకి ఫ్రెండ్‌తో సినిమాకు వెళ్లదలచుకున్న నేను ఇంక ఆ విషయాన్ని మరీ అంతగా పట్టించుకోలేదు.

ఆ మర్నాడు అక్క పోరు పడలేక స్కూల్‌కి రిజల్ట్స్ కోసం వెళ్లాను.

ఇంటర్వ్యూ జరిపిన డైరెక్టర్ హఠాత్తుగా ఏదో ఊరు వెళ్లవలసి వచ్చిందనీ, కనీసం వారం రోజులు పట్టవచ్చనీ, తిరిగి వచ్చిన తర్వాతే ఎవరెవరు సెలక్టయినదీ చెప్తారని తెలిసింది.

ఇంకేం చెయ్యడం! వెనుదిరిగి వెళ్లబోయి నవాడినల్లా ఎవరో నన్ను గమనిస్తున్నట్లు అని పించి పక్కకి తిరిగి చూశాను.

అరమోడ్పు కనులతో, అలవోకగా నావ ంక మైమరచిపోయినట్లు చూస్తోంది ఆ సుందరి.

ఒక్క క్షణం గుండె లయతప్పినట్లనిపిం చింది.

చూపు మరల్చుకుందామనుకున్నాను. కాని విఫలుడనయ్యాను.

నేనుకూడా తనను గమనిస్తున్నానని తెలి సి కంగారుగా తల దించుకుంది.

"ఓహో సుందరీ నీవంటి దివ్యస్వరూప ంబు ఎందెందు వెదకిన లేదుకదా" మాయ బజార్ పాట గుర్తొచ్చింది.

"ఎక్స్‌క్యూజ్ మీ..."

ఉలిక్కిపడి వెనక్కితిరిగి చూశాను.

"మీకు ఇంకా ఏదన్నా పనుందా?" ప్రిన్సిపల్ అడిగింది.

తడబడుతూ "లేదండీ... సారీ..." అనేసి గబగబా గుమ్మంవైపు వడుస్తున్న నాకు కిసుక్కున నవ్వు వినిపించింది.

ఎవరా అని వెనుదిరగబోయాను.

కాని ధైర్యం చాలలేదు.

తప్పకుండా ఇది ఆ సుందరి నవ్వే అయి వుంటుంది.

బయటకు వచ్చి సిగరెట్ వెలిగించి బస్టాప్ వైపు నడిచాను.

వద్దన్నా ఆ సుందరి ఆలోచనలు నన్ను చుట్టుముట్టాయి.

ఎంత అందంగా వుంది ఆ అమ్మాయి. ఆమె కట్టుకున్న ఎర్రచీర, మ్యాచింగ్ బొట్టు ఆమె పసిమి ఛాయమీద కొట్టొచ్చిన ట్టు కనిపిస్తూ ఆమె అందాన్ని మరింత ద్విగుణీకృతం చేస్తున్నాయి.

నేను వచ్చిన పనేమిటి, ఇక్కడ జరుగుతున్నదేవిటి అని నన్ను నేను ప్రశ్నించుకున్నాను.

"లవ్ ఎట్ ఫస్ట్ సైట్" అన్న సూక్తి వినడం తప్ప ఇంతవరకు అనుభవంలోకి రాలేదు.

కొంపదీసి దీన్నే ప్రేమంటారా???

ఛీ... ఛీ... ఇది ప్రేమ ఎలా అవుతుంది?

అవును. ఎందుక్కాకూడదు?

మరి ముక్కూ మొహం ఎరుగని అమ్మాయి గురించి ఇంత ఎందుకు ఆలోచిస్తాను? నన్ను నేను మళ్లీ ప్రశ్నించుకున్నాను.

ఏమో... ప్రేమ ఎక్కడ, ఎప్పుడు, ఎందుకు, ఎలా పుదుతుందో ఇంతవరకు ఎవరన్నా చెప్పగలిగారా?

ఉహూ... లేదు.

మరి...

ఈ రెండక్షరాల నిర్వచనం బంధానుబంధాలనుబట్టీ, సందర్భాలనుబట్టి వేర్వేరు అర్థాలు ఉత్పన్నమవుతాయి.


భక్తుడికి భగవంతుడిమీద ఆవిర్భవించే ప్రేమ, గురుశిష్యుల ప్రేమ, తల్లికి బిడ్డపై మనతానుబంధమైన ప్రేమ, భార్యాభర్తల మధ్య అనురాగమైన ప్రేమ, ప్రేయసీప్రియుల చిలిపి ప్రేమ, పార్వతీ దేవదాసుల అనిర్వచనీయమైన ప్రేమ, లైలా మజ్నూల మరపురాని ప్రేమ, అన్నాచెల్లెళ్ల పవిత్ర ప్రేమ, బావా మరదళ్లమధ్య సరసమైన ప్రేమ, కళాకారుడికి తన కళలపైన ప్రేమ, చిత్రకారుడికి ప్రకృతిమీద ప్రేమ.

ఇంకా చెప్పాలంటే ప్రతి మనిషికి తనదైన ప్రాణం, డబ్బు, ఆస్థులపై ప్రేమ.

అన్నింటిని మించి రాధామాధవుల ప్రేమ...

వేళ్లు చురుక్కుమనడంతో ఈ లోకం లోకొచ్చి చేతిని చూసుకున్నాను.

సిగరెట్ పూర్తిగా అయిపోయింది. దాన్ని



పారేసి ముట్టూ మూశాను. ఇదేమిటి? నేనెక్కడకొచ్చాను.

నవ్వుకున్నాను.

ఈ అమ్మాయి ఆలోచనల్తో బస్టాప్ దాటి చాలా దూరం వచ్చేశాను.

మళ్లీ వెనక్కి వెళ్లాలనిపించడంలేదు. రిక్షాని పిలిచి ఎక్కి కూర్చున్నాను.

"ఎక్కడికెళ్లాలి సార్"

"చెప్పాను.

ఇంటర్ పూర్తిచేసి టైపు, షార్ట్‌హ్యాండ్ నేర్చుకున్నాను. అదే ఇన్‌స్టిట్యూట్‌లో ఇప్పుడు ఇన్‌స్ట్రక్టర్‌గా పనిచేస్తున్నాను.

రిక్షా ఇన్‌స్టిట్యూట్ ముందు ఆగింది.

డబ్బులిచ్చి లోపలికి నడిచాను.

అప్పటికే స్టూడెంట్స్ అందరూ వచ్చేశారు. కొంచెం సేపు చెప్పి, ఇంక చెప్పలేక సెలవుతీసుకుని ఇంటికి వచ్చేశాను.

ఆ తర్వాత మిగిలిన వారం రోజులు గడపడానికి కష్టమైందనే చెప్పాలి.

◇ ◆ ◇

ఆ రోజు ఉదయాన్నే తొమ్మిది గంటలకే చక్కగా తయారై "అక్కా... ఈ రోజు నీ రిజల్ట్స్ కోసం స్కూలుకెళ్లాలికదూ!" అని అడిగాను.

నాకంటే రెండు సంవత్సరాలే పెద్దయిన అక్క "ఏరా! ఆరోజు అంత రానని మొండికేసిన నువ్వు ఈ రోజు నీ అంతట నువ్వే వెళ్లాలంటున్నావు... ఏంటి సంగతి?" అని కళ్లెగరేసింది.

ఎక్కడ బయట పడిపోతానో అని భయంతో "ఇన్‌స్టిట్యూట్‌కి వెళ్తున్నాను. రాలేకనా అని అడిగాను. అయినా... అవసరం లేదికదా! నువ్వు వెళ్లమంటేనే వెళ్తాను. లేకపోతే లేదు." అన్నాను నిక్కచ్చిగా.

"నేరకపోయి అన్నానుకాని వెళ్లుబాబూ' అంది బ్రతిమాలే ధోరణిలో.

పుస్తకాలు తీసుకుని తిన్నగా ఫ్రెండ్ రవి ఇంటికి వెళ్లి, బైక్ అడిగి తెచ్చుకుని, అయిదు నిమిషాల్లో స్కూల్‌కి చేరుకున్నాను.

ఇంకా ఎవరూ రాకపోవడంతో స్కూలంతా ఖాళీగా వుంది. ప్యూన్ తాళం తీసి, నన్ను ఆఫీసులో కూర్చోబెట్టి వెళ్లిపోయాడు.

ఏం చేయాలో తోచని నేను, టేబుల్ మీదున్న పేపర్ తిరగేస్తూ కూర్చున్నాను.

చప్పుడైనట్లయి వెనక్కి తిరిగి చూశాను.

వారంరోజులుగా నా మదిలో మెదులుతున్న ప్రతిబింబం నా కళ్లెదుట నిల్చుంది.

నీలం రంగు పువ్వులతోనున్న మిల్క్‌వైట్ చీర కట్టుకుని అప్పుడే తలారబోసుకుని, లోకమంతటికీ శుభోదయం చెప్తున్న సూర్యుడిలా నాముందు వచ్చి నిల్చుంది.

పసిమి ఛాయ, బారెడు జడ, నుదుట నీలం రంగు మ్యాచింగ్ బొట్టు... ఇంకా ఏవేవో గమనిస్తున్న నేనునిదు నిమిషాలైనా తనడిగిన ప్రశ్న ఏమిటో తెలీక తిరిగి ప్రశ్నిస్తున్న నన్నుచూసి ఫక్కున నవ్వింది.

ఆ నవ్వుకి నేను ఈ లోకంలోకి వచ్చిపడ్డాను.

"ఎస్ మిస్టర్... " సందిగ్ధంగా ఆగిపోయింది.

"శ్రీరామ్..."

"ఏంటి విషయం... ఇలా వచ్చారు? అని అడిగింది. లేచి నిల్చుంటున్న నన్ను

కూర్చోమని సైగచేసి తనుకూడా పక్కనే వున్న కుర్చీలో కూర్చుంది.

"మా సిస్టర్ టీచర్స్ ఇంటర్వ్యూకి అటెండ్ అయింది. దాని రిజల్ట్స్ కనుక్కుందామని..." నసిగాను.

"అయ్యో! అంత దూరంనుండి కనుక్కోవడానికి వచ్చారా? డైరెక్టర్‌గారు ఇంకా రాలేదు. బహుశా ఒకటి రెండు రోజుల్లో రావచ్చు" అని ఆగి "కాల్ లెటర్‌లో ఫోన్ నంబరుందికదా! ఫోన్‌చేసేరావాల్సింది" అంది.

"ఫోన్ చేస్తే ఈ దేవీదర్శనం అయ్యేది కాదుకదా?" మనసులో అనుకున్నాను.

"ఆ... ఫరవాలేదులెండి" ఓ పిచ్చి నవ్వు పారేశాను.

వచ్చిన పని అయిపోయింది. కాని ఆమెని మాటల్లోకి దింపాలనిపించింది. ఆమె తియ్యని కంఠస్వరం మరీ మరీ వినాలనిపిస్తోంది.

ఈలోగా నా ముందున్న పుస్తకాలు చూసి తనే అడిగింది.

"షార్ట్‌హ్యాండ్ నేర్చుకుంటున్నారా?" అని.

"లేదండీ... నిర్మల్‌జ్యోతి ఇన్‌స్టిట్యూట్‌లో ఇన్‌స్ట్రక్టర్‌గా పనిచేస్తున్నాను"

ఒక నిమిషం గడిచింది. ఆమెకి తెలియకుండా తేనెలాంటి ఆమె అందాల్ని నా కళ్లు భ్రమరాల్లాగా ఆస్వాదించాలని ఉవ్విళ్లూరుతున్నాయి.

కాని నా దొంగ చూపుల్ని ఆమె కనిపెట్టేసినట్లుంది.

ఏమీ తోచని దానిలాగా తల వంచుకుని తన పొడుగాటి చేతిగోళ్లవైపు చూసుకుంటోంది.

వుండుండి నావైపు చూస్తోంది. అంటే.. అంటే ఆమె మనసులోకూడా ఇలాంటి అలజడి...

అదే నిజమైతే... ఓహ్...

తన భ్రమ కాదుకదా... ఏమో?...

## ఈగల్లా జనాలు

"ఏమిటీ ఆయనచుట్టూ అందరూ అలా గుమిగూడుతున్నారేమిటి?"

"మరేంలేదు... ఆయనకో చక్కెర ఫ్యాక్టరీ, రెండు బెల్లం ఫ్యాక్టరీలు ఉన్నాయిలే... అందుకే జనాలు ఈగల్లా ముసురుతున్నారు"

—ప్రియా సరస్వతి



ఏదైతేనేం... ఇంక ఆమెని ఇబ్బంది పెట్టడం భావ్యం కాదనిపించింది.

"మళ్లీ ఎప్పుడు రమ్మంటారు?" అడిగాను.

"ఫోన్ చేసి రండి" అంది.

"ఏం... ఫోన్ చెయ్యకుండా రాకూడదా ..." అన్నాను ఆమె కళ్లల్లోకి చూస్తూ.

"అహ... అబ్బే... అలా అని కాదు..." తడబడింది.

"మరి..." ప్రశ్నించాను.

"మీ ఇష్టం... మీరు ఎప్పుడు వచ్చినా ఫరవాలేదు" కంగారును అణచుకుంటూ అంది.

"మరయితే సాయంత్రం నాతో కలిసి టీ తాగడానికి ఏదయినా అభ్యంతరమా?"

ఊహించని ప్రశ్నకి మరింత కంగారుపడింది.

ఒక్క నిమిషయం మౌనం వాట్యం చేసింది ఇద్దరి మధ్య.

"సారీ మిస్..."

"జ్యోతి"

"సారీ మిస్ జ్యోతీ... మరీ చొరవ తీసుకున్నట్లున్నాను... క్షమించండి." బాధ పడుతూ అన్నాను.

"అబ్బే... అదేం లేదు. సాయంత్రం అయిదున్నరకి వీలైతే రండి..." అంది.

"థాంక్స్... సెలవు. సాయంత్రం కలుస్తాను" అని బయటకు నడిచాను.

నా మనసు ఆనంద డోలికలో తేలిపోతుండగా ఈల వేసుకుంటే ఒక్క కిక్‌తో బైక్ స్టార్ట్ చేశాను.

"చూపులు కలిసిన శుభవేళ ఎందుకు నీకీ పరవశము" మాయాబజార్ పాట ఎక్కడో మైక్‌లో వినిపిస్తోంది.

○ ● ○

సాయంత్రం ఐదు గంటలకు టింగురంగా తయారై స్కూలు వైపు దారితీశాను.

ఎదురుగుండా కనబడిన ప్యూన్‌ని "జ్యోతి మేడమ్‌గారు ఉన్నారా?" అని అడిగాను.

"అమ్మగారు ఆరి గదిలోనే వున్నారండీ. ఎవురో వత్తారని సెప్పిండ్రు. మీరేనా బాబూ?"

అవునన్నట్లు తలూపాను.

"నాతో రండి సార్"

"గార్డెన్ దాటి, రెసిడెన్షియల్ క్వార్టర్స్ వైపు వెళ్తున్న నాకు ఒక పూల సజ్జలో నందివర్ధనం పూవులు కోస్తూ కనబడింది.

"ఏ దివిలో విరిసిన పారిజాతమో, ఏ కవిలో మెరిసిన ప్రేమ గీతమో" పాట గుర్తొచ్చింది.

"అమ్మగోరూ... మీకోసం ఎవురో బాబుగారు వచ్చిండు"

"అరె! వచ్చేశారా? రండి..." అని "నువ్వెళ్లు" అని ప్యూన్ని పంపించేసింది.

"రండి" లోపలికి దారితీసింది.

తన వెనకే అడుగులు వేసుకుంటూ ఆ తెల్లటి పాదాలపై వెండి పట్టీలు ఎంత అందంగా వున్నాయో గమనిస్తూ మొదటి మెట్టుని ఢీకొని ఆమెమీద పడ్డాను.

సరిగ్గా అప్పుడే నాతో ఏదో మాట్లాడడానికి వెనుదిరిగిన ఆమె నా పరిస్థితిని త్రుటిలో గ్రహించి తన కుడిచేతిని నాకు ఆసరాగా ఇచ్చింది.

అంతా సెకండ్స్‌లో జరిగిపోయింది.

ఒక్క క్షణం ఇద్దరం ఒకరికి ఒకరం దగ్గరగా... కళ్లు కళ్లు కలుసుకున్నాయి. ఇద్దరి శరీరాల్లో విద్యుత్ ప్రవహించింది.

ఒక్క క్షణం కాలం అలాగే ఆగిపోతే బాగుణ్ణనిపించిది. ముందుగా తనే తేరుకుంది.

"లోపలికి రండి..."

స్పృహలోకొచ్చి చటుక్కున ఆమె చేతిని వదిలేశాను.

"కూర్చోండి" కుర్చీ చూపించింది.

ఆమె లోపలికి వెళ్లింది.

చుట్టూ చూశాను.

కుడి పక్కన ఒక మంచం, దాని పక్కనే అద్దం వున్న చిన్న బీరువా, మధ్యలో నేను కూర్చున్న చోట్లో నాలుగు కుర్చీలు,, మధ్యన టీపాయ్, ఎడమవైపున ఒక టేబుల్ , దానిపైన చిన్న టి.వి. గది చిన్నదే అయినా ఎంతో పొందిగ్గా సర్ది వుంది.

చల్లటి మంచినీళ్లు ఇచ్చి మళ్లీ లోపలికి వెళ్లింది.

ఐదు నిమిషాల్లో పొగలు కక్కుతున్న రెండు టీలు, బిస్కెట్లు, మిక్స్చర్ ట్రేలో పెట్టి తీసుకు వచ్చి టీపాయ్ మీద పెట్టింది.

"తీస్కోండి..." ఒక కప్పు అందించింది.

తమకూడా టీ తీస్కుంది.


టీ తాగుతూ చాలాసేపు మాట్లాడుకున్నాం. ఒకరి మనసులు ఒకరి ముందుంచుకున్నాం.

ఆమె ప్రతి కదలికని తదేక దృష్టితో పరిశీలిస్తున్న నాకు కనీసం చేతి గడియారం వంక చూడ్డానికి కూడా మనసొప్పలేదు.

ఆమె స్వగ్రామం కావలి. కాస్తో కూస్తో ఆస్తిపరులే. తండ్రి చిన్నప్పుడే పోయారు. అన్నగారు పొలాలు చూసుకుంటూ తల్లినీ, తనని రెండు కళ్లుగా భావిస్తున్నాడు.

డిగ్రీ పూర్తిచేసి, ఖాళీగా కూర్చోవడం

## వేగంగా నడిచే ట్రెయిన్



"పారిస్‌నుంచి 426 కిలోమీటర్ల దూరంలో వియాన్ నగరానికి గంటా 40 నిమిషాలలో చేరుకోగలిగింది. ఈ ట్రెయిన్ పేరు టి.జి.వి వచ్చే సంవత్సరాంతానికి పూర్తి వేగం అందుకుంటుంది.

— శ్రీశారద

ఇష్టంలేక సరదాగా టీచర్ పోస్ట్‌కి అప్లై చేసింది. అనుకోకుండా వెంటనే ఇంటర్వ్యూకి కాల్ లెటర్ వచ్చింది. తల్లికిష్టం లేకపోయినా తన సరదాలని కాదని తనని బాధపెట్టడం ఇష్టంలేని అన్నయ్య తల్లిని సమాధానపర్చాడు.

ఫలితంగా ఇంటర్వ్యూలో సెలెక్ట్ కావడం ఉద్యోగంలో చేరిపోవడం వెంటవెంటనే జరిగిపోయాయి.

తనతోపాటు ఇంకో నలుగురు టీచర్లు పనిచేస్తున్నారు.

అందరికీ స్కూలు వెనకాలే ఎకామడేషన్ ఇవ్వడంతో అంతా ఒక దగ్గరే వుంటారు.

ఇక్కడికి వచ్చి ఒకటిన్నర సంవత్సరాలైంది.

ఈ స్కూలువారు వేరే రెండు ఊర్లలో రెండు బ్రాంచిలు పెట్టారట. అవసరమైతే ఒక బ్రాంచినుండి ఇంకో బ్రాంచికి ట్రాన్స్‌ఫర్ చేస్తారట.

కావలికి దగ్గర్లోనే వున్న ఊర్లో ఈ మధ్యనే ఈ బ్రాంచి పెట్టారుట. అక్కడికి ట్రాన్స్‌ఫర్ చేయించుకోమని అమ్మ పోరు పెడుతోందని అన్నయ్య వ్రాశాడని చెప్పింది.

"మరి మీరు వెళ్లిపోతారా?" బాధగా అడిగాను.

"తెలీదు. కాని నేను ఒక్కర్తినే ఇంత దూరంలో వుండడం అన్నయ్యకీ, అమ్మకీ ఇష్టం లేదు. నేను చేయకపోయినా అన్నయ్య మాత్రం గట్టి ప్రయత్నాలు చేస్తున్నాడు.

ఇద్దరూ కొద్దిసేపు మౌనంగా వుండిపోయాం.

ఎప్పుడు చీకటి పడిందో తెలియలేదు.

జ్యోతి లేచి లైట్ వేసింది.

"లవ్ ఎట్ ఫర్స్ట్ సైట్" అన్నది నా మనసులో దృఢపడింది. ఎందుకంటే మా దో కలయికవల్ల మేమెంతో దగ్గరయ్యామనే చెప్పాలి. పెళ్లిమాట అటుంచి ప్రేమకు మాత్రం గట్టి పునాది ఏర్పడిందనే చెప్పొచ్చు.

సాయంత్రం ఏడున్నర అయింది.

షాపింగ్‌కెళ్లిన మిగతా నలుగురు టీచర్లు మేమున్న గదిలోకి వచ్చి నన్నుచూసి ప్రశ్నార్థకంగా ఆగిపోయి ఒకరి మొహాలు ఒకరు చూసుకున్నారు.

నన్ను పరిచయం చేసి, వారితో మాటల్లో పడింది.

నేనింక అక్కడ వుండడం భావ్యంకాదని పించి కళ్లతోనే తన దగ్గర అర్ధమనస్సుతో సెలవుతీసుకుని ఇంటికి తిరుగుముఖం పట్టాము.

ఆ తర్వాత మూడు నాలుగుసార్లు కలుసుకున్నాం.

కలుసుకుంటున్న ప్రతిసారి మా మధ్య ప్రేమానురాగాలు మరింత పెరగసాగాయి.

అక్క ఇంటర్వ్యూలో సెలెక్ట్ కాలేదని తెలిసింది.

ఒకరోజు షార్ట్ హ్యాండ్ క్లాసునుండి ఇంటికి వచ్చేసరికి నా పేర్న ఒక టెలిగ్రాం వచ్చి వుంది.

"స్టార్ట్ ఇమ్మీడియట్లీ మదర్ బ్రదర్"

వైజాగ్‌లో వున్న అన్నయ్య టెలిగ్రాం పంపించాడు.

ఎప్పుడో ఒకసారి అన్నయ్యతో తనకి

మంచి ఉద్యోగం చూసిపెట్టమని అడిగాను.

"ఏదైనా వుంటే చూసి వెంటనే టెలిగ్రాం ఇస్తాను" అన్నాడు.

బహుశా ఏదైనా ఉద్యోగం దొరికుంటుంది. ఛ... ఇదికూడా ఇప్పుడే రావాలా?

వెంటనే అది తీసుకుని జ్యోతి ఇంటికి వెళ్లి తలుపు తట్టాను.

తలుపు తెరుచుకుంది.

"రండి" అంది ముభావంగా.

ఆమెను పరిశీలనగా చూశాను. ఏడ్చినట్లుంది కళ్లు ఎర్రగా మంకెన పువ్వుల్లా వున్నాయి. నా టెలిగ్రాం సంగతి మర్చిపోయాను.

"జ్యోతీ... ఏమైంది... అలా వున్నావేంటి?"

జవాబుగా నా చేతిలో ఒక కవరు పెట్టింది.

ఆతృతగా అందులోని కాగితం తీసి చదివాను. నా నవనాడులూ కృంగిపోయినట్లనిపించింది.

"స్టార్ట్ ఇమ్మీడియట్లీ — బ్రదర్" జ్యోతి వాళ్లన్న పంపిన టెలిగ్రాం. పేలవంగా ఆమెకేసి చూశాను.

ముఖం క్రిందికి దించుకుని, వస్తున్న దుఃఖాన్ని అదిమిపెట్టే ప్రయత్నంచేస్తోంది.


"జ్యోతీ..." లాలనగా పిలిచాను.

నా ఆత్మీయతకి కరిగిపోయిన ఆమెకు దుఃఖం రెట్టింపయి చేతుల్లో ముఖం దాచుకుంది.

ఆమె బాధకి నా మనసు అల్లల్లాడింది. లేచి ఆమె పక్కకుర్చీలో కూర్చున్నాను.

అనునయంగా ఆమె చేతిని నా చేతిలోకి తీసుకున్నాను. విచిత్రంగా ఆమె అడ్డు చెప్పలేదు.

"జ్యోతీ! నువ్వు ఒక రకంగా బాధపడితే నేను మరోరకంగా బాధపడుతున్నాను. నేను ఎందుకొచ్చానో తెలుసా" టెలిగ్రాం చూపిం



చాను.

ఈసారి ఆశ్చర్యపోవడం ఆమె వంతయింది.

ఇదేమిటన్నట్లు నావైపు తడికళ్లతో చూసింది.

"మా అన్నయ్య నాకోసం ఉద్యోగం రెడీగా వుంచాడు. నాకు అస్సలు వెళ్లాలని లేదు. ఎందుకో తెలుసా? నీకోసం... నిన్ను విడిచి వెళ్లలని లేదు. ఇన్నాళ్లూ ఉద్యోగం కోసం తాపత్రయపడి, దానికోసం ఏదన్నా వదులుకోవడానికి సిద్ధపడిన నేను ఈరోజు నా జ్యోతికోసం ఈ ఉద్యోగాన్ని వదులుకుంటున్నాను" నా మాట పూర్తికాలేదు.

"వద్దు శ్రీరావ్... ప్లీజ్ మీకొచ్చిన ఈ సదవకాశాన్ని సద్వినియోగం చేసుకోండి. నేనెటూ వెళ్లిపోవాలి. నేనిక్కడ వుండనప్పుడు మీరు నాకోసం ఈ ఉద్యోగాన్ని మానుకోవడంలో అర్ధం లేదు"

నిజమేననిపించింది.

"ఎప్పుడు బయలుదేరుతున్నావు?"

"ఇంకో రెండు గంటల్లో ట్రైముంది"

ఒక గంటసేపు ఇద్దరం కష్టసుఖాలు చెప్పుకున్నాం. టైము దగ్గర పడుతున్నకొద్దీ ఇద్దరి మనసులూ బరువెక్కాయి. ఇంక ఎప్పటికి కలుసుకుంటామో, జీవితంలో మళ్లీ కలుసుకుంటామో లేదో?

ఇద్దరం స్టేషన్‌కు వెళ్లాం.

గబగబా ఒక చిన్న కాగితంమీద నా అడ్రస్ రాసిచ్చాను.

"బ్యాగ్‌లో పెట్టుకో. ఇప్పుడే వస్తాను" అనేసి వెళ్లి పళ్లు, పుస్తకాలు, కూల్‌డ్రింక్స్ తెచ్చాను.

"ఎందుకివన్నీ" అంది మొహమాటంగా.

"నా మనసుకు తోచిన పని చేయడంలో నాకు సంతోషంగా వుంటుంది. తప్పా?" ఆమె కళ్లలోకి చూశాను.

అందంగా నవ్వింది.

ఆరాధనగా ఒకరిని ఒకరు చూసుకుంటూ డ్రింక్స్ తాగాం. రైలు కూతకూసింది.

"అరె... నీ అడ్రెస్ ఇవ్వలేదు" అన్నాను.

గబగబా బ్యాగ్‌లోంచి ఒక కాగితం, పెన్ను తీసి రాసిచ్చింది. అప్పటికే రైలు నెమ్మదిగా కదిలింది.

కన్నీళ్లతో వీడ్కోలు చెప్పింది.

ధైర్యం చెప్పడానికన్నట్లు ఆమె చేతిని నా చేతిలోకి తీసుకుని సున్నితంగా నొక్కాను.

"ఉత్తరం వ్రాస్తావుకదూ!" అన్నాను బాధగా.

"తప్పకుండా..." అంది తన చేతిలోనున్న నా చేతిని తిరిగి నొక్కుతూ.

రైలు స్పీడు పెరగడంతో చెయ్యి వెనక్కి తీసుకున్నాను.

రైలు పూర్తిగా కనుమరుగయ్యేంతవరకు వుండి కాళ్లీడ్చుకుంటూ బరువెక్కిన మనస్సుతో భారంగా బైటికి నడిచాను.

సిగరెట్‌కోసం జేబులో చెయ్యి పెట్టాను.

చిన్న కాగితం తగిలింది. బయటికి తీసి చూశాను.

"అరె... నేను వ్రాసిచ్చిన అడ్రస్ వెనకాలే తన అడ్రస్ వ్రాసిచ్చిందేంటి

పిచ్చిపిల్ల...'' అనుకున్నాను.

ఇంక మనసు బాగుండక ఇంటికెళ్ళి పడుకున్నాను.

ఆ రాత్రి భోజనం చెయ్యాలనిపించలేదు. జ్యోతి ఆలోచనలతో ఎప్పటికో నిద్రపట్టింది.

○ ● ○

''రామం... రామం...''

అమ్మ కేకతో మెలకువ వచ్చి, మళ్ళీ కళ్ళు మూసుకున్నాను. నేను లేవకపోవడంతో మళ్ళీ దగ్గరకొచ్చి లేపింది.

''ఏంటిరా? అన్నయ్య పెళ్ళిగ్రాం పంగతి మర్చిపోయావా? వైజాగ్ వెళ్లడం లేదా?'' ప్రశ్నల వర్షం కురిపించడంతో చటుక్కున లేచి కూర్చున్నాను.

''అరే మర్చిపోయాను. ఇదుగో ఇప్పుడే తయారవుతాను'' అని లేచి గబగబా సూట్‌కేస్ సర్దుకున్నాను.

బ్రష్‌చేసి స్నానం చేసి వచ్చాను.

టీ త్రాగుతూ జ్యోతికి ఉత్తరం వ్రాసి, వెనకాల నా అడ్రస్ వ్రాసి, తన అడ్రస్‌కోసం నిన్న వేసుకున్న షర్ట్‌కోసం వెతికాను. ఎక్కడా కనబడలేదు.

''అక్కా.... నిన్న ఇక్కడ పెట్టిన షర్టు ఏదీ...'' అడిగాను.

''అదా... బాగా మాసినట్లనిపిస్తే ఇందాకే ఉతికి ఆరేశాను.

''అయ్యో... ఎంత పనిచేశావ్...'' అంటూ ఒక్క ఉదుటున లేచి, బయటికి వెళ్ళి ఆ షర్ట్ జేబులో తడిమి చూశాను.

అందులోంచి చిన్న కాగితం ముద్దలా బయటికొచ్చి వెక్కిరించింది. ''ఇప్పుడేం చేస్తావ్'' అన్నట్లుగా.

ఉస్సూరంటూ లోపలికి వెళ్లి దిండులో తల దాచుకున్నాను బాధని దిగ మింగుకోవడానికి.

నేను వ్రాసిన అడ్రస్ వెనకాలే తన అడ్రస్ వ్రాసి తను ఒక పొరపాటు చేస్తే, ఆ కాగితాన్ని భద్రపరచుకోకపోవడం నేనుచేసిన ఇంకో పొరపాటు. కాని మా ఇద్దరి పొరపాట్లు మా మధ్యన ఉత్తర ప్రత్యుత్తరాలకి తావులేకుండా తూర్పు పడమరలాగా రెండు కలవని దిక్కులుగా మిగిల్చేసింది. తన అడ్రస్ నా దగ్గరుండికూడా నేను ఉత్తరం వ్రాయలేదని నన్నొక మోసగాడిగా పరిగణిస్తుందా... హే భగవాన్... నా జ్యోతికి ఈ విషయం తెలిపేదెలా... ఎలా?

నా మనసు మౌనంగా రోదిస్తోంది.

ఎప్పటికో నెమ్మదిగా లేచి జ్యోతికి రాసిన ఉత్తరాన్ని ఒకసారి చదువుకుని ముక్కలుగా చింపి బైట పారేశాను.

అన్యమనస్కంగా తయారై సూట్‌కేస్ తీసుకుని స్టేషన్‌కి వెళ్లడంకోసం బయటికి నడిచాను.

''తూర్పు పడమర ఎదురెదురు, నింగి నేల ఎదురెదురు

కలియని దిక్కులు కలియవని, తెలిసీ ఆరాటం దేనికని''

రేడియోలో సన్నగా పాట వినిపిస్తోంది.

○ ● ○